క్లుప్తంగా

ఘనంగా మరిడిమాంబ తీర్థం



అమ్మవారికి పూజలు చేస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, తదితరులు

కె.కోటపాడు : మండలంలో పాచిలవానిపాలెం గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందించారు. తీర్థానికి పరిసర గ్రామాల ప్రజలతో పాటు బంధువులు పెద్ద సంఖ్యలో రావడంతో గ్రామమంతా సందడిగా మారింది. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, గండి సత్యం, సిరపరపు రమణారావు, రొంగలి గణేష్, రొంగలి నర్సింగరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



శ్రీగౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న భక్తులు

రోలుగుంట: కొవ్వూరు గ్రామంలో పాత రామ మందిరం వద్ద గౌరీపరమేశ్వరుల ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. గ్రామ యువకులు విచిత్ర వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఉత్సవమూర్తులను పల్లకిలో గ్రామంలో ఊరేగించి శనివారం చెరువులో నిమజ్జనం చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు కొయిలాడ ఈశ్వరరావు, బంటు రాజు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న రాజాన సూర్యచంద్ర

నాతవరం: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించేందుకు స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాజాన సూర్యచంద్ర అన్నారు. నాతవరం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పూడి చక్రవర్తి, వెలగా వెంకట కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



ప్రచారం చేస్తున్న ఐసీడీఎస్ పీవో శ్రీదేవి

చీడికాడ: బాల్య వివాహాలతో పలు అనర్థాలు చోటు చేసుకుంటాయని మాడుగుల ఐసీడీఎస్ పీవో శ్రీదేవి అన్నారు. మండలంలోని తురువోలు ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధించడంలో ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యమన్నారు. బాలికలపై అత్యాచారాలు, వేధింపులను అడ్డుకోవడంలో కూడా ప్రతి ఒక్కరి కృషి అవసరమన్నారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'విడాకులు కావాలి' నాటిక ప్రదర్శన నేడు

మునగపాక: గౌతమపఠన మందిరం స్వర్ణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి విడాకులు కావాలి నాటిక ప్రదర్శించనున్నట్లు మందిర సభ్యులు తెలిపారు. స్థానిక సంతబయిల పఠన మందిరం సమీపంలోని స్టేజిపై రాత్రి 7 గంటలకు నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు.

లక్ష్యం దిశగా అడుగులు!

- పన్నుల వసూళ్లపై అధికారుల స్పెషల్ డ్రైవ్
- రూ.7.44 కోట్ల లక్ష్యానికి రూ.3.77 కోట్ల వసూలు



పురపాలక సంఘం కార్యాలయం

నర్సీపట్నం: పన్నుల వసూళ్ల లక్ష్యంగా పురపాలక సంఘం అధికారులు ముందుకు సాగుతున్నారు. ఆస్తి, నీటి పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్సుల ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. లక్ష్యం మేరకు పన్ను వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. లక్ష్యం చేరడానికి రెండు నెలలు మాత్రమే గడువు ఉండటంతో పన్నుల వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. నర్సీపట్నం పురపాలక సంఘంలో పన్ను వసూళ్లు ఊపందుకుంది. పన్ను వసూళ్లు జనవరి మూడో వారం నాటికి 64.5 శాతానికి చేరుకుంది.

పురపాలక సంఘంలో 15,467 ఆస్తి పన్ను అసెస్మెంట్లు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు ఆస్తి పన్ను డిమాండ్ రూ.7.44 కోట్లు కాగా, రూ. 3.77 కోట్లు వసూలు చేశారు. మిగతావి మార్చి నాటికి వసూలు చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. నీటి పన్ను డిమాండ్ రూ.73 లక్షలు కాగా రూ.8 లక్షలు మాత్రమే వసూలైంది. తాగునీటి కొళాయి పన్ను బకాయిలు ఎక్కువగా పేరుకుపోయాయి. మున్సిపాలిటీలో ప్రభుత్వ భవనాలు 77 వరకు ఉన్నాయి. ఈ భవనాల నుంచి సుమారు రూ.కోటి వసూలు కావాల్సి ఉంది. పన్ను వసూళ్లతోనే మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు, కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లింపు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు చేపట్టాలి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని స్పెషల్ డ్రైవ్ ద్వారా పురపాలక సిబ్బంది పన్నులు వసూలు చేస్తున్నారు.

సకాలంలో పన్ను చెల్లించండి



వంద శాతం పన్ను వసూలు చేసేందుకు కృషి చేస్తున్నాం. బకాయిదారులు సకాలంలో పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తాం. అప్పటికీ స్పందించని పక్షంలో ఇంటి కొళాయి కనెక్షన్‌ను కట్ చేస్తాం. బిల్ కలెక్టర్, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశాం. స్పెషల్ డ్రైవ్ చేస్తూ పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పన్ను వసూళ్లకు నోటీసులు ఇస్తాం.

– జి.సురేంద్ర, కమిషనర్, నర్సీపట్నం మున్సిపాలిటీ

పశు వ్యాధులపై అప్రమత్తత అవసరం



దాలివలసలో రైతులకు మందులు అందిస్తున్న ఏడీ దినేష్‌కుమార్, పశువైద్యాధికారి నాయుడు



ఎ.కొత్తపల్లిలో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి



పాకలపాడులో రైతులకు సూచనలు చేస్తున్న నర్సీపట్నం డివిజన్ పశువైద్య అసిస్టెంట్ డైరెక్టర్ రాంబాబు

కె.కోటపాడు : పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని చౌడువాడ పశువైద్యాధికారి సింహాచలంనాయుడు అన్నారు. రొంగలినాయుడుపాలెంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 19 పశువులకు చూడి తనిఖీలు, 26 పశువులకు గర్భకోశ చికిత్సలతో పాటు 26 పెయ్యిలకు నట్టల నివారణ మందులు అందించారు. మరో 27 పశువులకు సాధారణ వైద్యం చేశారు. వేసవి కాలంలో పశుగ్రాసం సమస్య తలెత్తకుండా ముందస్తుగా రైతులు గడ్డి పెంపకం చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు జగన్నాథం, కనకారావు, తేజ, గోపాలమిత్రలు ముత్యాలనాయుడు, ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

కె.కోటపాడు : దాలివలసలో కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కె.కోటపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ పర్యవేక్షించారు. 48 పశువులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. 180 కోళ్లకు వ్యాక్సిన్లు వేశారు. రైతులకు మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లను ఆయన అందించారు.

నర్సీపట్నం: ఒ.ఎల్.పురంలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. నర్సీపట్నం పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు, డాక్టర్ పుష్ప పశువులకు వైద్య సేవలు అందించారు. 22 పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. 30 గొర్రెలు, 40 కోళ్లు, 10 పెయ్యలకు నట్టల నివారణ మందులు వేశారు.

పశుపోషణలో అప్రమత్తత అవసరం

మాకవరపాలెం: పశుపోషణలో పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని మాకవరపాలెం, రాచపల్లి పశువైద్యాధికారులు మణిదీప్, అనిల్ సూచించారు. మండలంలోని లచ్చన్నపాలెం, తూటిపాలలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 172 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు, మినరల్ మిక్సర్ ప్యాకెట్లు రైతులకు అందజేశారు.

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకట రమణతో కలిసి దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి ప్రారంభించారు. ఎం.అలమండ పశు వైద్యాధికారి కె.మంజుషారాణి వైద్య పరీక్షలు నిర్వహించారు. బోయిలకింతాడలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు ప్రారంభించారు. ఈ శిబిరంలో మామిడిపల్లి పశువైద్యాధికారి జి.ప్రియాంక వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

గొలుగొండ: పశు వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం డివిజన్ పశువైద్య అసిస్టెంట్ డైరెక్టర్ రాంబాబు తెలిపారు. పాకలపాడులో శుక్రవారం మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు చికిత్స చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు లోకుల రమేష్, శిరీష, రైతులు పాల్గొన్నారు.

బూరుగుపాలెంలో 26 నుంచి క్రికెట్ టోర్నీ

మాకవరపాలెం: ఈ నెల 26 నుంచి మండలంలోని బూరుగుపాలెంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ తెలిపారు. వచ్చే నెల 11న గ్రామంలో పరదేశమ్మ పండగ నేపథ్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నామన్నారు. రోజూ రాత్రి 7 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, పాల్గొనే జట్లు 26వ తేదీ ఉదయం 10 గంటల్లోపు వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.40 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు నగదు అందజేస్తామన్నారు. వివరాలకు 73308 74640, 84660 80449 నంబర్లలో సంప్రదించాలన్నారు.

శ్మశానవాటిక ఆక్రమణపై చర్యలు

రోలుగుంట: ఆక్రమణకు గురైన కుసురపూడి శ్మశానవాటిక స్థలంలో అధికారులు శుక్రవారం సర్వే చేపటారు. సర్వే నంబర్ 230లో 70 సెంట్లలో శ్మశానవాటిక ఉంది. దీనిలో కొంత ఆక్రమణకు గురైంది. దీనిపై సర్వే చేసి ఆక్రమణ స్థలం స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు ఈ నెల 6న స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మండల సర్వేయర్ తవుటునాయుడు సిబ్బందితో వెళ్లి సదరు స్థలాన్ని సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్థాయి సర్వేయర్ మహేష్, వీఆర్వో భోశం రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి అదనపు ఎస్‌ఐగా రాములమ్మ



బాధ్యతలు స్వీకరించిన పి.రాములమ్మ

దేవరాపల్లి: దేవరాపల్లి పోలీస్ స్టేషన్ అదనపు ఎస్‌ఐగా పి.రాములమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా పని చేసిన ఆమె తాజాగా బదిలీపై ఇక్కడ అదనపు ఎస్‌ఐగా విధుల్లో చేరారు. గతంలో యలమంచిలి, నర్సీపట్నం, ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్లలో ఎస్‌ఐగా పని చేశారు. అదనపు ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన రాములమ్మకు స్థానిక స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాములమ్మ మాట్లాడుతూ స్థానిక ప్రజల సహాయ సహకారాలతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని ఆమె కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి ట్యాంకుల ఏర్పాటు



అంగన్‌వాడీ వద్ద ఏర్పాటు చేసిన ట్యాంకును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దేవదత్తు

నాతవరం: మండలంలో 31 అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దేవదత్తు తెలిపారు. మండలంలో వెన్నలపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రానికి నూతనంగా ఏర్పాటు చేసిన ట్యాంకును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ట్యాంకుల ఏర్పాటు కోసం రూ.17 వేలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 31 కేంద్రాలకు ట్యాంకులతో పాటు కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరుగుదొడ్డి లేని అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.35 వేలు చొప్పున నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టరు ఎస్.రామకృష్ణ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని సంతకాల సేకరణ

అచ్యుతాపురం: నిత్యావసర ధరలు తగ్గించాలని కోరుతూ శుక్రవారం స్థానిక జంక్షన్‌లో ఐద్వా ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. రేషన్ డిపోల ద్వారా 16 నిత్యావసర వస్తువులను తక్కువ ధరకు ఇవ్వాలని కోరారు. పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, మండల కార్యదర్శి లక్ష్మి, మంగమ్మ, కాసులమ్మ పాల్గొన్నారు.

లక్షల వ్యయం.. ప్రయోజనం శూన్యం

- మొక్కుబడిగా కల్వర్టు మరమ్మతులు
- ఏలేరు నీరు కల్వర్టు పైనుంచి యథావిధిగా నీటి ప్రవాహం
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు



కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న ఏలేరు కాలువ నీరు

నాతవరం: ఏలేరు కాలువ నీరు కల్వర్టు పైకి కాకుండా రూ.8 లక్షల వ్యయంతో చేపట్టిన పనులు అక్కరకు రాకుండాపోయాయి. యథావిధిగా కల్వర్టు పైనుంచి నీరు ప్రవహిస్తోంది. ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి విశాఖ స్టీల్‌ప్లాంటుకు నీటి సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన ఏలేరు కాలువ నాతవరం మండలంలో 12 పంచాయతీలు పరిధిలో 26 కిలోమీటర్లు పొడవున ఉంది. మండలంలో మన్యపురట్ల గ్రామ సమీపంలో ఉన్న ఏలేరు కాలువపై రాకపోకలు సాగించేందుకు కల్వర్టు నిర్మించారు. అది క్రమేపి శిథిలమై ఏలేరు కాలువలో నీరు కల్వర్టుపై నుంచి ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనుల్లో నాణ్యత లోపించడంతో ఏలేరు కాలువలో నీరు కల్వర్టుపై నుంచి ప్రవహిస్తుంది. వర్షాలు పడే సమయంలో అయితే మరింత నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ కల్వర్టుపై మన్యపురట్ల, లింగంపేట, మాసయ్యపేట, కొత్త రామచంద్రపురం, వి.బి.అగ్రహారం, రాజుపేట అగ్రహారం గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత ప్రాధాన్యం ఉన్న ఏలేరు కాలువ నీరు కల్వర్టుపై ప్రవహించకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'పది'లో శత శాతం లక్ష్యం



విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకుంటున్న హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు

రోలుగుంట: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శత శాతం సాధన కోసం మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శెట్టి మోహన్ ఉపాధ్యాయులను మూడు బృందాలుగా ఏర్పాటు చేసి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. రాత్రి వేళల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు చదువుకోవడానికి ఎంత సమయం కేటాయిస్తున్నారు.. వారి సందేహాలను గుర్తించి నివృత్తి చేస్తున్నారు.

మంచు కురిసే వేళలో



పొగమంచు కారణంగా హరిపాలెం-కొండకర్ల మధ్య వాహనాలు కనిపించని దృశ్యం

అచ్యుతాపురం: శీతాకాల తీవ్రత ఇంకా కొనసాగుతోంది. సాధారణంగా భోగి తర్వాత మంచు తాకిడి తగ్గుతుంది. శివరాత్రికి పూర్తిగా శీతాకాల ప్రభావం మాయవుతుంది. అయితే శుక్రవారం మండల పరిధిలో పొగమంచు తీవ్రంగా కనిపించింది. రాత్రి నుంచి కురుస్తున్న మంచుకు తోడు తెల్లవారు జాము నుంచి ఉదయం 10 గంటల వరకూ మంచు ప్రభావంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించలేదు. వ్యవసాయ క్షేత్రాల్లో సుందర దృశ్యాలు ఆవిష్కారమవ్వగా, చిన్నారులు, వృద్ధులు కాస్త ఇబ్బందికి గురయ్యారు.

బాలికా విద్యకు ప్రభుత్వం పెద్దపీట



చౌడువాడలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి తరణి



ఏఎల్ పురం హైస్కూల్లో ఆటలు ఆడుతున్న బాలికలు



తాండవ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ప్రసన్న



బేతపూడి కేజీబీవీలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘన

కె.కోటపాడు : బాలికా విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, బాలికలకు అన్ని విధాలుగా తల్లిదండ్రులు కూడా ప్రోత్సాహాన్ని అందించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి తరణి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం చౌడువాడ హైస్కూల్‌లోని విద్యార్థినులకు బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. తరణి మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న విద్యార్థినులు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో కృపాలిని, పీహెచ్‌ఎన్ కనకవేణి, హెచ్‌వీ అచ్చియ్యమ్మ, ఏఎన్‌ఎం సన్యాసమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం బాలికా దినోత్సవం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

నాతవరం: విద్యార్థినులకు విద్యతో పాటు ఆరోగ్యం చాలా ముఖ్యమని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. మండలంలో శుక్రవారం తాండవ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో జాతీయ బాలికా శిశు దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా బాలికలు ఇప్పట్నుంచే వాటిని అధిగమించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేజే పురంలో బాలికా దినోత్సవం

మాడుగుల రూరల్: మండలంలో కేజే పురం గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవం ఘనంగా జరిగింది. బాలికలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పి.చంద్ర, కె.వి.పద్మలక్ష్మి, తులసీ, మహాలక్ష్మి, జి.సూర్యకళ, కె.ధనలక్ష్మి, బి.వెంకటలక్ష్మి, వి.నాగలక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, సీడీఎస్ సూపర్‌వైజర్ వి.ఈశ్వరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ లలిత, ఎల్.లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కె.జె.పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాడుగుల ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దాసు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవ ఆవశ్యకతకు సంబంధించిన పోస్టర్‌ను వైద్య సిబ్బందితో కలసి మహిళా సంరక్షణ కార్యదర్శి జి.వరలక్ష్మి ఆవిష్కరించారు. రోలుగుంట కేజీబీవీలో బాలికలు, అంగన్‌వాడీ వర్కర్లతో కలసి సూపర్‌వైజర్లు ర్యాలీ నిర్వహించారు.

దేవరాపల్లి: రైవాడ పంచాయతీ శివారు బేతపూడి కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికల సంరక్షణపై దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్య మేఘన అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులు, వైద్య సిబ్బంది కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎ.కొత్తపల్లి హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు వై.స్వర్ణలత ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.కోటపాడు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీవో వి.మంగతయారు పాల్గొన్నారు.

బీటీఏ జిల్లా అధ్యక్షుడిగా ఈశ్వరరావు



బీటీఏ కొత్త కమిటీ సభ్యులతో ఉపాధ్యాయ సంఘం నాయకులు

బుచ్చెయ్యపేట: బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) జిల్లా అధ్యక్షుడిగా ఈశ్వరరావు ఎన్నికయ్యారు. శుక్రవారం సాయంత్రం వడ్డాదిలో రాష్ట్ర బీటీఏ అధ్యక్షుడు శరత్‌చంద్ర ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో కొత్త కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా దాసరి నర్సింగరావు ఎన్నికయ్యారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజన టీచర్స్ అసోసియేషన్, పీఆర్‌టీయూ కలిసి గాదె శ్రీనివాసులనాయుడుకు మద్దతు తెలుపుతున్నట్లు శరత్‌చంద్ర, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ ప్రకటించారు. త్వరలోనే బీటీఏ జిల్లా కార్యవర్గ సభ్యులను పూర్తి స్థాయిలో ఎంపిక చేస్తామని శరత్‌చంద్ర తెలిపారు.

తాగునీటి సమస్యపై సభ్యుల ఏకరువు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని పలు గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు సర్వసభ్య సమావేశంలో ఏకరువు పెట్టారు. శుక్రవారం ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కనకమ్మ మాట్లాడుతుండగా కో–ఆప్షన్ మెంబర్ షేకు సూర్యనారాయణ అడ్డుపడ్డారు. ఖండివరంలో రెండో విడతలో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలు పని తీరు బాగా లేదని, కాంట్రాక్టర్ సక్రమంగా పనులు చేపట్టలేదని, బిల్లులు చెల్లించవద్దని కోరారు. దీంతో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనుల్లో నాణ్యత కొరవడి లక్ష్యం నెరవేరలేదని ఆక్షేపించారు. కులవృత్తులు, చేతి వృత్తుల వారికి బీసీ వెల్ఫేర్ నుంచి రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఎంపీపీ జయమ్మ మాట్లాడుతూ సచివాలయాల్లో జేఎల్‌ఎంలు అందుబాటులో ఉండకపోవడంతో విద్యుత్ సమస్యలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడంలేదన్నారు. ఈ సమస్యపై ఏఈ దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, ఎంపీడీవో హేమసుందరరావు, రాష్ట్ర బీసీ వెల్ఫేరు చైర్మన్ పి.వి.జి.కుమార్, వైస్ ఎంపీపీ కిముడు చిన్నమ్మలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాల నివారణ



బుచ్చెయ్యపేటలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

బుచ్చెయ్యపేట: ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం బుచ్చెయ్యపేటలో రహదారి భద్రతపై వెలుగు సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ఈ ర్యాలీ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్, కారులో ప్రయాణిస్తున్న వారు సీటు బెల్టు ధరించాలన్నారు. వెలుగు ఏపీఎం టి.రాజబాబు, ఈవో లవరాజు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.